www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 24 డిసెంబర్ 2024

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని నిరాశ్రయులైన పేదలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు నరసింహారాజు, జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ వణికిస్తున్న శీతాకాలన్నీ దృష్టిలో ఉంచుకొని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పిడికిటి సంతోష్, జూన్ చైర్మన్ వై.సుబ్రహ్మణ్యం రాజు, మాజీ రీజన్ చైర్మన్ షేక్ అబ్దుల్లా, మాజీ జోన్ చైర్మన్ నాసరుద్దీన్, క్లబ్ సీనియర్ ప్రతినిధి మలిశెట్టి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలి

- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్
- కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ అనుసంధాన పైప్‌లైన్ పథకం నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జిఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ అనుసంధాన పైప్ లైన్ ప్రాజెక్ట్ నిర్వాసితులైన రైతులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యాన్ని స్థిరీకరించడం తోపాటు తాగునీటిని అందించడమే లక్ష్యంగా జీఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధాన పనులను రూ.4,374 కోట్లతో ప్రతిష్టాత్మకంగా గత ప్రభుత్వం చేపట్టిన విషయం గుర్తు చేశారు. ప్రాజెక్టు పూర్తికి రెండేళ్ల సమయం కేటాయించినప్పటికీ, రెండేళ్లలో కాలువలు తవ్వకం కూడా జరగలేదని అన్నారు. ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం భూములు కోల్పోయి నిర్వాసితులు అయ్యే వారికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇచ్చి, పునవాసం కల్పించాల్సిన ప్రభుత్వ పెద్దలు భూములు లాక్కుని పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గం అన్నారు. ములకల చెరువు, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లి, పెద్దమండెం మండలాల్లో 250 మంది కి పైగా రైతులను రోడ్డున పడేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. ఒక్క రైతుకు నోటీసులు ఇవ్వకుండా ఎకరాకు రూ.6 లక్షల చెల్లిస్తామని నోటిమాటగా చెప్పి సి ఫారంలో సంతకాలు చేపించుకున్న ప్రభుత్వం అత్యంత నిరంకుశంగా వ్యవహరించందని విమర్శించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.12 లక్షలు పలుకుతున్న భూములకు రూ.6 లక్షలు ఇస్తామనడం రైతులను ముంచ డానికేనన్నారు. ప్రభుత్వం స్పందించి, నిర్వాసితులకు భూ సేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని, భూమికి, భూమి ప్రత్యామ్నాయం చూపిం చాలని, పున రావాసం, పునఃనిర్మాణం ద్వారా ఇళ్ల స్థలాలు మంజూరు చెయ్యాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందచేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, జిఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ నిర్వాసిత రైతులు శంకర, భాస్కర, పవన్, శ్రీనివాసులు, మస్తాన్‌రెడ్డి, ఎరుకలరెడ్డి, నరసింహులు, సుగుణ, మంజుల, సుకన్య, వీరమల్‌రెడ్డి, రీడిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ శాంతియుత పోరాటం చేయాలి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ర్యాలీలో పాల్గొన్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

మన దేశం శాంతియుత దేశమని యుద్ధ నివారణకు ప్రతి ఒక్కరూ కుల మతాలకతీతంగా శాంతియుత పోరాటం చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో సేవ్ ఎర్త్ నో వార్ (యుద్ధం వద్దు శాంతి ముద్దు) అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ యుద్ధం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని మన దేశం శాంతి సామరస్యానికి నిలయం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఎలాంటి విపత్తు జరిగిన శాంతియుత వాతావరణంలో ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 1947 సంవత్సరంలో మహాత్మాగాంధీ హయాం నుంచి మనం శాంతియుత మార్గంలో నడుచుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నో దేశాలలో యుద్ధాలు జరిగి ప్రాణ, ఆస్తి నష్టాలు జరిగినప్పటికీ మనదేశంలో ఎటువంటి విపత్తులు జరగకుండా శాంతియుత మార్గంలో నడవడం జరుగుతుందన్నారు. ఇతర దేశాలు మన దేశానికి దండయాత్ర చేసేందుకు వచ్చినప్పటికీ శాంతియుత మార్గంలోనే వాటిని ఎదుర్కొంటున్నామని చెప్పారు. మనదేశంలో ఎటువంటి యుద్ధాలు జరగకుండా ప్రపంచవ్యాప్తంగా శాంతిని నెలకొల్పాలని రాయచోటి ప్రాంతం నుంచి సేవ్ ఎర్త్ నో వార్ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అన్ని జిల్లాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచానికి శాంతి సందేశాన్ని పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు ఇప్పటినుంచే క్రమశిక్షణ మార్గంలో నడిచి మంచి భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఒక్కరూ కుల మతాలకతీతంగా శాంతియుత పోరాటం చేయడం వల్ల ఎటువంటి సంఘటనలు జరగకుండా నివారించవచ్చునన్నారు. రాయచోటి పట్టణంలో సేవ్ ఎర్త్ నో వార్ అనే కార్యక్రమం నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అన్నమయ్య నూతన జిల్లాలో ఇలాంటి మంచి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా జూనియర్ కాలేజ్ గ్రౌండ్ నుంచి ఎస్ఎన్ కాలనీ శివాలయం వరకు విద్యార్థిని విద్యార్థులచే యుద్ధం వద్దు శాంతి ముద్దు అనే నినాదాలతో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాల విద్యార్థుల విద్యార్థులు, లైన్స్ క్లబ్ సభ్యులు పట్టణపుర ప్రముఖులు పాల్గొన్నారు.

పాఠశాలలోబోరును ప్రారంభించిన మంత్రి

చిన్నమండెం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నీటి సమస్య పరిష్కరించేందుకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నూతన బోరు వేసి విద్యార్థులకు నేటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి అక్కడి వసతులు గురించి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రహరీ కావాలని ఉపాధ్యాయులు కోరగా మంత్రి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం పక్కనే ఉన్న ఉర్దూ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులను మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న ఉపాధ్యాయులు పాఠశాలపైన కరెంటు తీగలు ఉన్నాయని వాటి వల్ల విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని మంత్రికి తెలియజేశారు. వెంటనే మంత్రి ఉర్దూ ఉన్నత పాఠశాల పైన ఉన్న కరెంటు తీగలను వెంటనే తొలగించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.

గ్రీన్‌అంబాసిడర్‌కు మంత్రి పరామర్శ

రామాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద ఉన్న విశ్రాంతి తీసుకుంటున్న గువ్వలచెరువు గ్రీన్ అంబాసిడర్ రెడ్డినాయక్‌ను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సుగాలి బిడికి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి ఎంఎస్ఆర్ఎం ట్రస్టు నుండి ఆర్థిక సాయం అందించారు. రెడ్డి నాయక్ కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గాలివీడు సురేంద్రనాథ్‌రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు శిక్షణ

అతిథులకు మెమోంటోను ఇస్తున్న రామలింగారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎడ్యునెట్ ఫౌండేషన్ సహకారంతో ఇసిఇ, సిఎస్ఇఎఐ, ఎఐడిఎస్ బ్రాంచ్‌ల రెండవ సంవత్సరం విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై వారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కంప్యూటర్ సైన్స్‌లో అభివృద్ధి చెందుతున్న రంగాలపై జ్ఞానాన్ని పొందేందుకు దాదాపు 350 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారన్నారు. కంప్యూటర్ సైన్స్‌లో అభివృద్ధి చెందుతున్న రంగాల్లో జ్ఞాన సముపార్జన ప్రాముఖ్యతపై కొన్ని అంశాలను వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు ఐబిఎం స్కిల్ బిల్డ్ ప్రోగ్రాం గురించి వివరించారు. ఐబియ స్కిల్స్ బిల్డ్ అనేది విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకులకు విలువైన కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి, కెరీర్ అవకాశాలను పొందేందుకు సహాయపడే ఉచిత విద్యా కార్యక్రమమని పేర్కొన్నారు. అభ్యాసకులు వారి విద్య, కెరీర్ ప్రయాణాల ద్వారా అభివృద్ధి చెందుతున్నప్పుడు వారి అవసరాలకు ప్రతిస్పందించే లక్ష్యంతో అనుకూలీకరించిన ఆచరణాత్మక అభ్యాస అనుభవాలతో అనుబంధించబడిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రోగ్రామ్ కలిగి ఉందని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ హెచ్ఒడి డాక్టర్ ఆర్.మహమ్మద్ షఫీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనేది రాష్ట్రంలో నైపుణ్యం-అభివృద్ధి వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి పిపిపి కార్పొరేషన్‌గా ఏర్పడిన ఒక ప్రత్యేకమైన సంస్థని పేర్కొన్నారు. గుంటూరు నుండి నరేంద్ర, అశ్విని కుమార్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో సిఎస్ఇ హెచ్ఒడి డాక్టర్ కె.లక్ష్మయ్య, సిఎస్ఇ హెచ్ఒడి ఎఐ డాక్టర్ ఎం.రోషిణి, డీన్‌లు, వివిధ విభాగాల హెచ్ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్లకు ఎన్నికల బిల్లులు చెల్లించాలి : సిఐటియు

ర్యాలీలో పాల్గొన్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మేలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో క్యాబ్ డ్రైవర్లకు ఇవ్వాల్సిన రూ.30 లక్షల అద్దె బకాయిలు వెంటనే ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అద్దె కిచ్చిన క్యాబ్ డ్రైవర్ల అద్దె బిల్లులు త్వరగా ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదన పల్లి, తంబళపల్లి అసెంబ్లీల నియోజకవర్గాలలో 37 వాహనాలు, 7 కాన్వయ్ వాహనాలు 2 నెలలు ఎన్నికల నిమిత్తం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు వెహికల్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన బడ్జెట్‌ను వేరే అవసరాలకు వాడుకుని అద్దెకిచ్చిన క్యాబ్ డ్రైవర్లకు మొండి చేయి చూపడంతో వారు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని తెలిపారు. అడిషనల్ బడ్జెట్ వస్తుందని 6 నెలలలుగా ఆఫీస్ చుట్టూ తిప్పుకోవడం అధికారులకు తగదన్నారు. అనంతరం కలెక్టర్‌కు పిర్యాదు చేయగా పెండింగ్ బిల్లులు సిఎఫ్ఎంఎస్ పంపామని, రిజర్వ్ బ్యాంకు దగ్గర పెండింగ్ ఉన్నాయని, పది రోజుల్లో బిల్లులు ఇచ్చేలా హామీ ఇచ్చారన్నారు. జిల్లా అధ్యక్షులు ఎస్.సయ్యద్సాహెబ్ వలి, ప్రధాన కార్యదర్శి యస్.వాహబ్ సి.బాలసుందరం మాట్లాడుతూ ఎన్నికలు అయిపోయి 6 నెలలు దాటిందని క్యాబ్‌ల అద్దె లు, డిజిల్ ఖర్చులు అప్పులు తెచ్చి నడిపామని, అప్పుల వారితో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. పది రోజుల్లో బిల్లులు రాని యెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటరమణ, జోహార్, భాస్కర్, రాంబాబు, మధుసూదన్, సైపుల్లా, రమేష్ బాబు, అక్బర్ బాషా, షౌకత్, సత్యకుమార్, మస్తాన్ పాల్గొన్నారు.

జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఆర్‌టిసి బలోపేతానికి ప్రత్యేక చర్యలు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శివాలయం సర్కిల్‌లో 8 నూతన ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశమని రాబోయే రోజులలో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని నూతన బస్సులు ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఎపిఎస్ఆర్‌టిసిని బలోపేతం చేసి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చుతామని తెలిపారు. గత ఐదేళ్లలో ఎపిఎస్ఆర్‌టిసి పూర్తిగా నిర్వీర్యమైందని చెప్పారు. రాబోయే కాలంలో ఎపిఎస్ఆర్‌టిసిని పూర్తి ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజులలో ఎక్కడ చూసినా ఎలక్ట్రిసిటీతో నడిచే బస్సులను రోడ్లపైకి తీసుకువస్తామని తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పెరిగిన ధరలకు అనుగుణంగా 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ట్రైబల్ టీచర్లు సోమవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఆయన గెస్ట్ హౌస్‌లో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీచర్లు కుళ్లాయప్ప, మహదేవ్, సుధాకర్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం గతంలో గిరిజన బిడ్డల ఉజ్వల భవిష్యత్‌కు కోసం చిత్త శుద్ధితో గిరిజన సంక్షేమ పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తక్కువ వేతనాలతో 15 ఏళ్ల నుంచి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న డిఎస్‌సి నియామకాల్లో తమను మినహాయించి మిగిలిన పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. స్పందించిన మంత్రి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీచర్లు కాదంబరి, సత్యం రెడ్డి, సంజీవ వెంకటస్వామి, స్వర్ణలత, విజయకుమారి, గీతాంజలి, ప్రభావతి వెంకటశివమ్మ, విజయలక్ష్మి రాధిక, సుమతి పాల్గొన్నారు.

కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య

ప్రజాశకి-రాయచోటి

జాతీయ అంధత్వ, దృష్టిలోప నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తయినట్లుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య పేర్కొన్నారు.బడికి వెళ్లే విద్యార్థులలో అందత్వము, దృష్టి లోపం నివారణ కోసం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 3200 కళ్ళద్దాల కోసం ఈ నెల 14న టెండర్ నోటిఫికేషన్ ఇచ్చామని, టెండర్ దరఖాస్తులను సమర్పించడం కోసం ఈ నెల 16 నుండి 22వ తేదీ వరకు గడువు ఇచ్చామన్నారు. అందిన దరఖాస్తులను సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆధ్వర్యంలో, జిల్లా ప్రొక్యూర్మెంట్ కమిటీ తనిఖీ చేసి, తక్కువ కొటేషన్ ఇచ్చిన రాయచోటికి చెందిన మస్తాన్‌కు 3200 కళ్లద్దాల తయారీ పనిని అప్పగించినట్లుగా ఆయన పేర్కొన్నారు.

నేడు పులివెందులకు జగన్ రాక

ప్రజాశక్తి పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నారు. 24న బెంగళూరు నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఇడుపులపాయ ఎస్టేట్ చేరుకుని వైఎస్ఆర్ ఘాట వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పిస్తారు.. అనంతరం కుటుంబసభ్యుల తోనూ, వైసిపి నాయకులతో చర్చించి అక్కడే బస చేస్తారు. 25న ఉదయం 8 గంటలకు ఇడుపులపాయ నుంచి బయలుదేరి పులివెందుల సిఎస్ఐ చర్చ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం వివాహ వేడుకల్లో పాల్గొని తర్వాత లింగాల మండలం తాతి రెడ్డిపల్లి సీతారామ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 26 తేదీన పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. 27న ఉదయం 9 గంటలకు విజయ గార్డెన్‌లో నిర్వహించే వాహ వేడుకల్లో పాల్గొని విజయవాడకు బయలుదేరుతారు.

తెలుగు రచయితల మహాసభలకు 'గంగనపల్లి'కి ఆహ్వానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అమ్మ భాషను కాపాడుకుందాం ఆత్మాభిమానం పెంచుకుందాం అనే నినాదంతో ఈ నెల 28, 29వ తేదీలలో విజయవాడలో జరిగే 6వ తెలుగు ప్రపంచ రచయితల మహాసభలకు రాజంపేట పట్టణానికి చెందిన తెలుగు పండితులు, కవి గంగనపల్లి వెంకటరమణ ఆహ్వానం అందింది. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణా జిల్లా రచయితల సంఘం, కెబిఎన్ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సభలకు ప్రతినిధిగా తనను ఆహ్వానించారఅన్నారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచందుల నుండి తనకు ఆహ్వానం అందిందని తెలిపారు. తెలుగు రచయితల మహాసభలలో ప్రతినిధిగా గంగణపల్లికి ఆహ్వానం అందుకోవడం పట్ల తెలుగు భాషా సంరక్షణ సమితి రాజంపేట మండల శాఖ అధ్యక్షులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, ఉపాధ్యక్షులు బివి నారాయణరాజు, భాషాభిమానులు భాషోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

- వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

ప్రజాశక్తి- రాయచోటి

కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను ఆరు నెలల్లో మూడ దఫాలు పెంచి అటు రైతుల, ఇటు సామాన్యుల నడ్డి విస్తుందని వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బోస్ నగర్‌లో ఉన్న వైసిపి జిల్లా కార్యాలయంలో విద్యుత్ ఛార్జీల బాదుడుపై పోరుబాట పోస్టర్‌ను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాక మునుపు ఎన్నో హామీలు ఇచ్చిందన్నారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, రైతులే విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగదారులకు అమ్మే విధంగా పరిస్థితులు తీసుకొస్తామని ప్రగల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. అధికారంలో వచ్చిన ఆరు నెలల్లోనే మూడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. ఎస్‌సి కాలనీలలో విద్యుత్ కనెక్షన్లు తొలగించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు 27న విద్యుత్ ఛార్జీల బాదుడిపై వైసిపి పోరుబాట పట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో ర్యాలీలు నిర్వహించి విద్యుత్ స్టేషన్‌ల ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చిన దాఖలా లేదన్నారు ప్రభుత్వంలో ఎక్కడా ఎటువంటి విద్యుత్ సమస్యలు లేవని, రైతుల అడిగిన వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసే పరిస్థితి ఉండదని వివరించారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగదారుల పక్షాన వైసిపి పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజా సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని చెప్పారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఆదివారం రెడ్డిపల్లి కట్ట దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భువనగిరిపల్లికి చెందిన కోలాటం నరసింహ, ఆయన సతీమణి సుజాత కుటుంబాన్ని సోమవారం రాజంపేట జనసేన పార్టీ సీనియర్ నాయకులు అతికారి కృష్ణ పరామర్శించారు. భువనగిరిపల్లె గ్రామానికి వెళ్లి వారికి సంతాపం తెలియజేసి తక్షణ సహాయంగా రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తల్లిదండ్రులిరువురిని కోల్పోయిన పిల్లలను ఓదార్చి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం : పీడీ

ప్రజాశక్తి-రాయచోటి: కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కొరకు ఈ నెల 24వ తేదీ నుండి జనవరి 2వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐసిడిఎస్ పీడీ రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు (12), సహాయకురాలు (93), మినీ అంగన్వాడీ కార్యకర్తలు (11) పోస్టులకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. పోస్టులకు సంబంధించిన అర్హతలు, పూర్తి నోటిఫికేషన్, దరఖాస్తు ఫారంలకు annamayya.ap.gov.in వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుండి కూడా దరఖాస్తులు పొందవచ్చని తెలిపారు.

కలెక్టరేట్‌లో క్రిస్మస్ వేడుకల హైటీ

కేక్ కట్ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి కలెక్టరేట్ ప్రాంగణంలో క్రిస్మస్ వేడుకల హైటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేక్ కోశారు. కొవ్వొత్తులను వెలిగించి క్రీస్తు గీతాలు ఆలపించారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రెండువేల ఏళ్ల క్రితం రోమ్ సామ్రాజ్యంలో జన్మించిన ఏసుక్రీస్తు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి ఆరాధ్యుడన్నారు. క్రిస్మస్ పండుగ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఘనంగా జరుపుకుంటారన్నారు. ప్రభుత్వం క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రభుత్వం తరపున సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రిస్టియన్ సోదరులకు విద్య, ఉద్యోగాలలో ఎన్నో అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. క్రిస్మస్ అంటే శాంతికి చిహ్నమని రాష్ట్ర ప్రజలందరూ శాంతియుతంగా, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం జెసి ఆదర్శ్ రాజేందర్ మాట్లాడుతూ కరుణ, దయ, దాతృత్వం కలిగిన ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి దారి చూపుతాయన్నారు. ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ రోజును ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ హైటీ కార్య క్రమంలో భాగంగా మంత్రి కేక్‌కట్ చేసి క్యాండిల్ వెలిగించి క్రైస్తవ సోదరులందరికీ ప్రభుత్వం తరపున క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదన్ రావు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ ఇమ్రాన్, పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న మహిళా సంఘాలు

మహిళలపై జరుగుతున్న హింస అనాగరికం

ప్రజాశక్తి-వీరబల్లి

మహిళలపై జరుగుతున్న హింస అనాగరికమని ఎంపిపి రాజేంద్ర నాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు, బాలికల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు తగ్గినప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. జండర్ వివక్షత చట్ట వ్యతిరేకమనే భావన అందరిలో కలగాలన్నారు. తహశీల్దార్ శ్రావణి మాట్లాడుతూ బాల్యవివాహాలు అరికట్టడంలో మహిళా సంఘాలు ప్రముఖ పాత్ర వహించాలన్నారు. మహిళా సమాఖ్య నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ద్వారా జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక వెలుగు ఎపిఎం ఖాదర్ వలి, ఇ.ఓఆర్డి రామ చంద్రారెడ్డి, మట్లి గ్రామ సర్పంచ్ నాగార్జునచారి, వెలుగు సిసిలు, కృష్ణయ్య, నాగేంద్ర, సుధాకర్, మండల సమాఖ్య కార్యదర్శి గులాబ్ జాన్, ఉపాధ్యాయులు వారాధమ్మ, విఒఎలు తులసి, కవిత, మహేశ్వర్‌రెడ్డి, మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు చెక్కును అందిస్తున్న శ్యామ్ సుందర్

నష్టపోయిన అరటి రైతులకు పరిహారం అందజేత

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

నియోజకవర్గంలోని వై.కోట గ్రామ సమీపంలో ఏనుగుల దాడిలో అరటి పంట నష్టపోయిన రైతులకు కోడూరు రేంజ్ ఎఫ్ఆర్ఓ పి.వి శ్యాం సుందర్ సోమవారం పరిహార చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం వేసవికాలంలో వై.కోట అటవీ సమీపంలోని రైతు పొలాలపై ఏనుగుల మంద దాడి చేసి అరటి పంటను ధ్వంసం చేశాయని అన్నారు. అందులో నొక్కన సుబ్బరత్నమ్మకు రూ.42వేలు, చలపతికి రూ.10వేలు వంతున చెక్కులను రైతులకు అందించినట్లు తెలిపారు.

మానవీయ విలువలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థులు మానవీయ విలువలపై అవగాహనకలిగి ఉండాలని ప్రముఖ రచయిత్రి విరసం సభ్యురాలు శశికళ పేర్కొన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలలో ఎలాంటి భయ భ్రాంతులకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు జీవితంలో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. పుస్తక పఠనం వలన కలిగే లాభాలు, వాటి ఉపయోగాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శ్యామలాదేవి, ఉపాధ్యాయ బృందం ఎస్ఎస్‌సి విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన శివరాం ప్రతాప్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మదనపల్లి నియోజకవర్గం పరిశీలకులు గాజుల శివరాం ప్రతాప్ సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలిసి ఎస్‌పి విద్యాసాగర్ నాయుడుని కలిశారు. ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ఎస్‌పి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు.

31న చింత చెట్ల వేలం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మదనపల్లి రహదారులు భవనముల శాఖకు సంబంధించిన చింత చెట్ల పంట సాయంపై హక్కులు కల్పించేందుకు ఈనెల 31వ తేదీన వేలం పాట జరుగుతుందని ఆర్‌ఎన్‌బి ఎఇ బుర్రయ్య తెలిపారు. మదనపల్లె ఆర్అండ్‌బి శాఖ తంబళ్లపల్లె సెక్షన్ ఆఫీస్ కార్యాలయ ఆవరణలో వేలం పాట జరుగుతుందన్నారు. ముదివేడు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, రోడ్డు పక్కన ఉన్న చింత చెట్లతో పాటు ముదివేడు, తంబళ్లపల్లె పెద్దమండ్యం రోడ్డులోని 46 కిలోమీటర్ల వరకు నిమ్మపల్లె, వాయల్పాడు, గుర్రంకొండ గాలి వీడు రోడ్డు, మొలకలచెరువు, తంబళ్లపల్లె రోడ్డు, కోటాల నల్లగుట్ల పల్లెల్లో రోడ్డు, గొల్లపల్లె, కోసువారిపల్లె, ముదివేడు రోడ్డు పక్కన ఉన్న చింత చెట్లకు వేలం పాట జరుగుతుందన్నారు. పాటదారులు ముందుగానే చింత చెట్ల పంట సాయాన్ని పరిశీలించి వేలంపాటలో వేయు రూపాయలు ధరను చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి

మండలంలో పక్కా నిర్మాణాల్లో వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి, ఇఒఆర్‌డి దిలీప్‌కుమార్ కోరారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో వెలుగు, సచివాలయం సిబ్బంది పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే పునాదులు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను గుర్తించి వారికి వెలుగు పథకం ద్వారా ఆర్థిక సాయం అందించి పనులు చేపట్టే విధంగా వెలుగు సిసిలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కృషి చేయాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే లబ్ధిదారులకు బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అప్పుడే వారికి నమ్మకం కలిగి త్వరగా పనులు పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఎఇ సుజాత, ఎపిఎం గంగాధర్, వెలుగు మండల సమైక్య అధ్యక్షురాలు రామలక్ష్మి, సిసిలు, పంచాయతీ కార్యదర్శులు, సంఘ మిత్రలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE : MADANAPALLE

I.A.No. 198/2021
A.S.No.   /2021
O.S.No. 277/2018

G.Reddy Sekhar & Others.
...Petitioners/Appellants
Vs
G.Venkata Ramana.
...Respondent

Notice to :
G. Venkata Ramana, S/o G.Narayana, R/a D.No.2-250-A-2, Raja Nagar, N.G.Palle, Kadiri Road, Madanapalle Town & Mandal.

NOTICE

పై దావాలో వాది ప్రతివాదిపైన అప్పీలు కేసు వేసివున్నాడు. కావున పై తెలిపిన ప్రతివాదియైన G.Venkata Ramana గారు 31.12.2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు పైన తెలిపిన కోర్టు యందు మీరు నేరుగా గానీ మీ తరపున వకీలు ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరములను దాఖలు చేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.

P.RAM PRASAD, MBA.,L.L.B.,
Advocate,
MADANAPALLE.
Cell: 9440539530.

నిమ్మనపల్లెలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రారంభం

- విద్యుత్ ఎఇ నాగరాజు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను చేపట్టినట్లు మండల విద్యుత్ శాఖ ఎఇ నాగరాజు అన్నారు. సోమవారం నిమ్మనపల్లి విద్యుత్ ఉపకేంద్రం వద్ద స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను లైన్ ఇన్స్‌పెక్టర్ చక్రపాణి, అదాని సంస్థల బృందంతో కలసి ఆయన ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎఇ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అదాని సంస్థల యాజమాన్యం సహకారంతో గతంలో విద్యుత్ శాఖ ఏర్పాటుచేసిన పాత మీటర్ల స్థానంలో కొత్తగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదట విడతలో ప్రభుత్వ కార్యాలయాల్లో, వాణిజ్య, వ్యాపార సంస్థలలో, వ్యాపార దుకాణాలల్లో ఉన్న పాత మీటర్ల స్థానంలో కొత్త స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెండవ విడతలో గృహాలకు సంబంధించిన మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. వినియోగదారులు వారి అవసరాన్ని బట్టి విద్యుత్తును ఉపయోగించుకోవడానికి స్మార్ట్ మీటర్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్ చక్రపాణి, అదాని సంస్థల ఇంజనీర్ బృందం టీమ్ లీడర్ హరి, శివ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్న ఎఇ నాగరాజు

కేన్సర్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా..ప్రాణభిక్ష పెట్టండి

దాతలను అర్థిస్తున్న బాధితురాలు భార్గవి

లప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేన్సర్ వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా.. ప్రాణభిక్ష పెట్టండంటూ భార్గవి అనే బాధితురాలు దాతలను అర్థిస్తోంది. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో తన భర్తతో కలిసి తమ గోడును వెల్లబోసుకుంది. మదనపల్లి పట్టణంలోని దిగువ కమ్మపల్లెకు నివాసం ఉంటున్నామని చెప్పారు. తన భర్త రవీందర్ నాయక్ హోటల్‌లో పనిచేస్తున్నాడని, తాను ఇళ్లల్లో పాచి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. మాకు పది నెలల చిన్నారి విభావరి ఉంది. నవం బర్ నెలలో పనులు చేస్తూ కిందపడ్డానని, ఆ సమయంలో మోకాలి వద్ద గాయం కావడంతో చికిత్స చేయించుకున్నానని చెప్పారు. క్రమే నా అది కేన్సర్‌గా మారడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయామని తెలి పారు. పని చేస్తే కానీ పూట గడవని పరిస్థితిలో ఉన్నామని, తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి సుమారు రూ. లక్ష వరకు ఖర్చు చేసి వైద్యం చేయించుకున్నా జబ్బు నయం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలోని స్విమ్స్, బర్డ్స్ హాస్పిటల్, బెంగళూరులోని వైదేహి హాస్పిటల్ లోని పెద్ద వైద్యులు పరీక్షించి ఇది చాలా తీవ్రమైన జబ్బు అని తప్పకుండా సర్జరీ చేయాలని రూ. 10 లక్షలు వరకు ఖర్చవుతుందని చెప్పారని అన్నారు. కూలి చేస్తే కాని కుండ కాలే పరిస్థితి తమది అంత డబ్బు వెచ్చించి ఆపరేషన్ చేయించుకునే స్థోమత లేదని అన్నారు. ఏమి చేయాలో తెలియక ఎమ్మెల్యేని ఆశ్రయించా మని, ఆరోగ్యశ్రీ పథకం గురించి అధికారులతో మాట్లాడారని అన్నారు. కేన్సర్‌కు ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయామని విలపించారు. రూ.10 లక్షలు లేనిదే సర్జరీ చేయమని వైద్యులు అంటు న్నారని, మాకు పది నెలల పాప ఉందని అన్నారు.కుటుంబ పోషణే భారంగా ఉందని,అంత డబ్బు పెట్టి వైద్య చేయించుకోలేమని అన్నారు. దాతలు స్పందించి వైద్య చికిత్సల కోసం ఆర్థిక సాయం చేసి ప్రాణభిక్ష పెట్టండి అంటూ బాధితురాలు ముకుళిత హస్తాలతో వేడుకుం టోంది. దయార్ధ హృదయులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు. దాతలు ఎవరైనా సాయం చేయాలనుకుంటే 91339 04329కు సంప్రదించాలని కోరారు.

ఆదుకోవాలని కోరుతున్న భార్గవి

కలకడలో తప్పని విద్యుత్ కష్టాలు

విద్యుత్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధుడు

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడలో విద్యుత్ కష్టాలు తప్పడం లేదని దుకాణదారులు, ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ కనెక్షన్లు ఉన్న గృహాల్లో కొద్దిపాటి మరమ్మ తులు వచ్చినా ట్రాన్స్‌కో కార్యాలయ సిబ్బంది ఫోన్ చేసి ఎల్‌సి తీసు కోవడం ఆనవాయితీ అయిపోయిందని విని యోగదారులు వాపో తున్నారు. వేరుశనగ, వరి నూర్పిడి చేసే మిషన్ల యజమానులు చాలా ఇబ్బందులు పడు తున్నామని పేర్కొ న్నారు. మీసేవ కేంద్రాల్లో రైతులకు, విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్లు, భూములు పత్రాలు అందించడానికి విద్యుత్ లేకపోవడం తీవ్ర అసౌకర్యంగా ఉందని అన్నారు. భూములను ఆన్‌లైన్ చేసుకోవడానికి వచ్చే రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్తు వస్తూ, పోతూ ఉండడం వల్ల మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని నవాబుపేటకు చెందిన రెడ్డప్పరెడ్డి వాపోతున్నారు. తమ భూముల 1బి అడంగల్ తీసుకోవడానికి వచ్చిన ఎర్రయ్యగారిపల్లికి చెందిన రామకృష్ణ తన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నా ట్రాన్స్‌కో కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి ఎఇ రాజశేఖర్‌ను వివరణ కోరగా కలకడలో ప్రతి ట్రాన్స్ ఫార్మర్‌కుఆఫ్ ఆన్ లేకపోవడం వల్ల ప్రతి వినియో గదారులకి ఇబ్బంది వస్తే ఎల్‌సి తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. వీలైనంత తర్వగా ట్రాన్స్ ఫార్మర్లకు ఆన్ ఆఫ్ ఏర్పాటుచేసి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు.

రైతుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి

కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

రైతుల అభివృద్ధే లక్ష్యంగా విద్యార్థులు కృషి చేయాలని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల సూచించారు. కెవికె కలికిరి ఆధ్వర్యంలో మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహించిన రైతు సదస్సుకు ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. కళాశాలలో నాలుగవ సంవత్సరం వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మూడు నెలల శిక్షణా కార్యక్రమానికి గాను కలికిరి, పీలేరు మండలాలలోని బాలంవారిపల్లి, నగిరి పల్లి, మర్రికుంటపల్లెల్లో అక్టోబర్ నుంచి మూడు నెలల పాటు వ్యవసా యం, అనుబంధ రంగాలపై అవగాహన పొందారు. సోమవారం రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు బాలంవారిపల్లిలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవికె కో-ఆర్డినేటర్ మంజుల మాట్లాడుతూ వ్యవసాయ ఆధునిక పద్ధతులైన డ్రోన్ వినియోగం, జీవ శిలీంద్రనాశినిలను వాడకం మొదలగు వాటిని ముందుకు తీసుకు వెళ్లాలని అన్నారు. వ్యవసాయాన్ని కూడా పరిశ్రమలాగా చేపట్టి అధిక దిగు బడులను చేపట్టాలని సూచించారు. పీలేరు వ్యవసాయ సహాయ సంచాల కులు వై.వి.రమణ రావు మాట్లాడుతూ సమీకృత వ్యవసాయం గురించి, ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి, వ్యవసాయంలో ఆధునిక పోకడల గురించి విశదీకరించారు.విద్యార్థులకు వారి ఉన్నతిని ఉద్దేశించి సూచనలు ఇచ్చారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.పవన్‌కుమార్‌రెడ్డి, రైతు దినోత్సవం నాడు రైతు సదస్సు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులను ఆదరించినందుకుగాను రైతులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు జిల్లాలో ముఖ్యంగా పండిస్తున్న వేరుశనగ, వరి, అపరాల్లోని మేలైన వంగడాలను, మట్టి నమూనా పరీక్షల యొక్క ఆవశ్యకతను తెలిపారు. డాక్టర్ మాధురి రైతులకు అందుబాటులో ఉన్న సమాచార వ్యవస్థల గురించి తెలియజేశారు. అభ్యుదయ రైతులైన సురేందర్ నాథ్ రెడ్డి, నాగరాజు, చంద్రయ్య కెవికె రైతులకు ఇచ్చే సలహాలను సద్వినియోగం చేసుకుంటున్నట్లు శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో తగిన సూచనలతో పాటు తోడ్పాటును అందించినట్లు చెప్పారు. విద్యార్థులు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని మార్గద ర్శకు లుగా వ్యవహరించిన శాస్త్రవేత్తలకు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.నూతన వంగడాలను పండించడానికి ఆసక్తి గల రైతుల జాబితాను తీసు కుంటూ, చిక్కుడు, అనప, సొర, బీర, బీన్స్, బెండ వంటి విత్తనాలను రైతు లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలను పరిశీలిస్తున్న కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ముగిసిన రేషన్ దుకాణాల దరఖాస్తుల ప్రక్రియ

ప్రజాశక్తి-బి.కొత్తకోట : మండలంలోని నూతన రేషన్ దుకాణాల దక్కించుకోవడానికి దరఖాస్తు ప్రక్రియ ముగిసిందని తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ పేర్కొన్నారు.షాపు-9 (ఒసి)కు 36, కుమ్మరపల్లి షాప్-28 (ఒసి) 16, గట్టు షాప్ నెంబర్-21 (ఒసి)కి 11, కోటావూరు షాప్ నెంబర్-30 (ఓసీ)కి 4, హార్సిలీహిల్స్ షాప్ నెంబర్-31 (ఒసి)కి 3 దరఖాస్తులు వచ్చాయన్నారు. తుమ్మనగుట్టకు 13 దరఖాస్తులురాగా కోర్టు ఆర్డర్ రావడంతో రద్దు పరిచినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి రాత పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ ఆధారంగా రేషన్ దుకాణాలు కేటాయిస్తామన్నారు.

మంత్రుల దృష్టికి నందలూరు సమస్యలు

ప్రజాశక్తి-నందలూరు : కడప పర్యటనకు వచ్చిన పర్యాటక,సాంస్కృతిక, సినిమాటో గ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మర్యాద పూర్వకంగా కలిసి నందలూరు సమస్యలను ప్రస్తా వించినట్లు నియోజకవర్గ జనసేన నాయకులు కొట్టే శ్రీహరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం కొట్టే శ్రీహరి మాట్లాడుతూ మండల కేంద్రనికి కూతవేటు దూరంలో ముక్తి కనుమపై కీ.శకం 3 శతాబ్దపు కాలం నాటి బౌద్ధ రామలు ఉన్నాయని, ఇవి బౌద్ధ మతస్తులు ఇక్కడ జీవించారనే దానికి సజీవ సాక్ష్యం అని అన్నారు. ఈ బౌద్ధ రామలు రాయల సీమలోనే మొదటి బౌద్ధ రామలు అని ఎంతో ఘన చరిత్ర వున్న ఈ బౌద్ధ రామలు గత పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమయి పోతున్నాయని అన్నారు. వీటిని అభివృద్ధి చేసి ఈ ప్రాంతంను పర్యాటకంగా అభివృద్ధి చెయ్యాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రి నిమ్మల రామానా యుడు తో అన్నమయ్య ప్రాజెక్టు స్థానంలో ప్రత్యామ్నాయ ప్రాజెక్టు నిర్మించా లని కోరినట్లు తెలిపారు. వచ్చిన నీరు వృధా అవుతోందని, అందువల్ల ఇక్కడ రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇక్కడ చెక్ డ్యాంలు అయిన నిర్మించి నీటిని నిలువ చెయ్యమని కోరినట్లు తెలిపారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -చిట్వేలి: విద్యార్థులకు వ్యవసాయంపట్ల ఆసక్తి కల్పించాలని శ్రీసాయి వికాస్ పాఠశాల కరస్పాండెంట్ రెడ్డయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక శ్రీ సాయివికాస్ ఉన్నతపాఠశాలలో రైతుదినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. రైతుదినోత్సవంలో భాగంగా 9,10 తరగతులవిద్యార్థులు కొత్తపల్లిలో రైతులతో కలసి పొలాలను సందర్శించి వ్యవసాయపద్ధతులు, ఆధునిక పనిముట్ల గురించి తెలుసుకున్నారు.కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

రైతు పొలాలకు ప్రాధాన్యత ఇవ్వండి

ప్రజాశక్తి-గాలివీడు

మాట్లాడుతున్న ఎపిడి నందకుమార్‌రెడ్డి

ఉపాధి హామీ పథకం ద్వారా జరిగే పనులలో రైతు పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎపిడి నంద కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ సభా భవనంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఫారం ఫండ్స్, సరిహద్దు కందకాలు, హార్టికల్చర్, మినీ గోకులాలను సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిఒ లు రామచంద్రయ్య, హరిప్రసాద్, ఇసి బాలాజీ, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

పట్టణంలోని డాల్ఫిన్ డెల్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ పంజం సుకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ తాత శాంటాక్లాస్ వేషధారణలో విద్యార్థులు అలరించారు. క్రీస్తు పుట్టుక, క్రిస్మస్ ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న కరస్పాండెంట్

సిఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మి

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని సీతారాంపేట వాస్తవ్యులు భీమిశెట్టి బలరామయ్యకు సిఎం సహాయనిధి కింద రూ.4,16,250ల చెక్కును సోమవారం ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిందని అన్నారు. అనారోగ్యానికి గురైన వారికి సిఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందించడానికి ప్రత్యేకంగా వ్యవస్థను ఏర్పరిచి పెద్ద ఎత్తు న లబ్ధి చేకూరుస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథ కాలు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సూర్య ఘర్‌తో ప్రతి ఇంటికి స్వావలంబన

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని ఎస్‌సి, ఎస్‌టిలు ప్రతి ఇంటా సూర్య ఘర్ పథకంతో ఆర్థిక స్వావలంబన వెలుగులు నిండాలని, వినియోగదారులు ఉచిత సూర్య ఘర్ సోలార్ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆపరేషన్ కిషోర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు సూర్య ఘర్ యోజన పథకంతో ఎస్‌సి,ఎస్‌టి వర్గాలకు అదనపు మేలు చేకూర్చేందుకు కీలక నిర్ణయం తీసుకున్నాయని అన్నారు. వీరి కోసం సొంత ఇళ్లపై సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.ఈ పథకంలో భాగంగా ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారుల ఇంటిపైన 2కె డబ్ల్యూపి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెల్‌ను సబ్సిడీతో పూర్తి ఉచితంగా పొందవచ్చు అన్నారు. ఇప్పుడు వాడుకుంటున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి అదనమని చెప్పారు. మీరు వాడుకున్న తర్వాత మిగిలిన యూనిట్లకు డిపార్ట్మెంట్ వారు ఆ రోజు ఉన్న యూనిట్ రేట్లను బట్టి వారి ఖాతాలో డబ్బు జమ చేస్తారని, ఇదిఅదనపు ఆదాయం సమకూరుస్తుందని అన్నారు. ఎస్‌సి,ఎస్‌టి విద్యుత్ సర్వీసుకు సంబంధించిన వివరాలను pmsuryaghar.gov.in వెబ్ సైట్ లో నమోదు చేసుకోవాలని, మిగతా మొత్తం ప్రభుత్వమే పూర్తి సబ్సిడీతో సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ సదవకాశాన్ని ఎస్‌సి, ఎస్‌టిలు, విద్యుత్ వినియోగదారులు సద్వినియో గపరచుకొని అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. వెబ్‌సైట్‌లో వివరాలు నమోదుకు విద్యుత్ సిబ్బంది మీకు సహకరిస్తారని అన్నారు. ఫోన్ నెంబర్ లింక్ ఉన్న ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ లింక్ ఉన్న బ్యాంక్ అకౌంట్, విద్యుత్ మీటర్ బిల్లు, ఫోన్ నెంబర్ ఉండాలన్నారు.

హెల్మెట్ ప్రయాణం సురక్షితం : సిఐ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మాట్లాడుతున్న సిఐ

ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, మదనపల్లి డిఎస్‌పి కొండయ్య నాయుడుల ఆదేశాలు మేరకు బి.కొత్తకోట సిఐ జి.జీవనగంగానాథ్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలో ప్రజలకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రోడ్డుపై ద్విచక్రవహనం నడిపే ప్రతి ఒక్కరూ కుడా హెల్మెట్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని,హెల్మెట్ ధరించకపోవడం వలన రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు తలకు బలమైన గాయం తగలడం వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ఉంటే తలకు ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు వలన మరణించే వారిలో ఎక్కువగా తలకు గాయాలై మరణించడం జరుగుతుందన్నారు. దానిని నివారించాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కిశోరి వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి-రామసముద్రం

మదనపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో రామసముద్రం మండలం ఎఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎంఎస్‌కెలకు వెలుగు కార్యాలయంలో ఉదయం పది గంటలకు కిశోరి వికాసం కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్ వైజర్ చంద్ర కాంత తెలిపారు. కార్యక్రమానికి సిబ్బంది హాజరు కావాలన్నారు.

క్రైం కార్నర్

అశోక్ లేలాండ్ వాహనంలో అగ్నిప్రమాదం

- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, చిప్పిలి వద్ద ఆదివారం అర్ధరాత్రి సమయంలో అశోక్ లేలాండ్ వాహనంలో హఠాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించింది.వెంటనే స్థానికులు అగ్నిమాపక అధికారి జి.శివప్పకి సమాచారం అందించారు. స్పందించిన ఆయన అగ్నిమాపక సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపుశారు. ఈ ప్రమా దంలో సుమారుగా రూ. 4.5 లక్షలు నష్టం వాటిల్లిగా, రూ. 1.5 లక్షలు ఆస్తిని కాపాడినట్టు యజ మాని బుడిమాని శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ జి.శివప్ప మాట్లా డుతూ ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగుంటుందని అంచనా వేశామన్నారు. అక్కడ ఉన్న ప్రజలకు అగ్నిప్రమాదాలు, వాటి నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు.

ప్రేమను అంగీకరించలేదని..

యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం, బసినికొండ డ్రైవర్స్ కాలనీకి చెందిన హమీదుల్ల కుమారుడు శిద్దిక్ అమీర్(20) అదే ప్రాంతానికి చెందిన ఓ యువతిని గత కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమెను పెళ్లి చేసుకోవడానికి కుటుంబీకులు అంగీకరించలేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన శిద్దిక్ అమీర్ సోమవారం ఇంట్లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించు కున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమిం చడంతో రుయాకు రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు.. ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మానవత్వాన్ని చాటుకున్నారు. సోమవారం బైపాస్ రోడ్డులో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఓ వృద్ధుడు ట్రక్కుబండి తగలడంతో కిందపడిపోయాడు. అదే సమ యంలో అటుగా వెళుతున్న ఎమ్మెల్యే వెంటనే కారు దిగి ఆ వృద్ధుడికి స్వయంగా సాయం చేసి ఆటోలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా అక్కడ వైద్యులకి ఫోన్ చేసి సదరు వృద్ధుడికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. పలువురు ప్రజలు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కరించడమే కాకుండా మానవతా దృక్పథంతో ఆదుకుంటున్న ఎమ్మెల్యే పనితీరు ప్రశంసనీయమన్నారు.